క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్

సైదాపురం: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని తహసీల్దార్ రమాదేవి అన్నారు. మండలంలోని పోతేగుంట గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు ద్వారా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎలాంటి భూ సమస్యలున్నా దరఖాస్తులు అందజేస్తే ఆ సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు, ప్రజల వద్ద నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్ఓలు పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ దయాకర్

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం ఉన్నత పాఠశాలలో గురువారం పూలే టీచర్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ దయాకర్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీటీఎఫ్ కార్యదర్శి గుమ్మడి వెంకటరత్నం మాట్లాడుతూ పూలే ఆశయాలను సమాజంలోకి తీసుకెళ్లి ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నం శ్రీనివాసులు, తుమ్మ రవి, నాపా వేణుగోపాల్, బొమ్మిశెట్టి ప్రసాద, తంబి వెంకటరమణయ్య, పి.శ్రీనివాసులు, రియాజ్, పెంచలయ్య తదితరులున్నారు.

డైరీ ఆవిష్కరించిన ఎంపీడీఓ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ డైరీ–2025ను ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. అనంతరం యునైటెడ్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కు సంబంధించిన క్యాలెండర్‌ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మురళీకృష్ణ, ఏఈ మునిమనోజ్ తదితరులున్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారంపై సమావేశం ఉంటుందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

స్టేడియంల ఏర్పాటు అభినందనీయం




స్టేడియం ప్రారంభోత్సవం

నాయుడుపేట టౌన్: క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ అధునాతన సౌకర్యాలతో స్టేడియంలు ఏర్పాటు చేయడం అభినందనీయమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. పట్టణంలోని స్వర్ణముఖి నది సమీపంలో ఇండేన్ గ్యాస్ గోదాము సమీపంలో నూతనంగా నిర్మించిన క్రికెట్, ఫుట్‌బాల్ ప్రాక్టీస్ ఇండోర్ స్టేడియంను ఎమ్మెల్యే నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే తోపాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఉయ్యాల ప్రవీణ్, పార్థు, సన్నారెడ్డి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 57.096 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 57.096 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1030, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

తిరుమూరులో రెవెన్యూ సదస్సు



అర్జీలు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

వాకాడు: మండలంలోని తిరుమూరు గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొన్నారు. అనంతరం పలు సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. రెవెన్యూ సదస్సులో అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆయన అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ అన్నపూర్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలకు సెలవు

- సచివాలయాల్లో అందని కీలక సేవలు
- పునరుద్ధరించని కూటమి ప్రభుత్వం
- ప్రజలకు తప్పని తిప్పలు



రాపూరు మండలం సంక్రాంతిపల్లిలో నిర్మిస్తున్న మోడల్ సచివాలయం

సైదాపురం: గతంలో ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ప్రజల కష్టాలను గమనించిన గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. వలంటీర్ల ద్వారా ప్రజలు ఇంటి ముంగిటకే సేవలను అందించింది. సచివాలయాల్లో వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులను నియమించి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. వలంటీర్ల సేవలకు మంగళం పాడింది. సచివాలయాల ద్వారా అందించే కీలకమైన సేవలను నిలిపివేసింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా సేవలను పునరుద్ధరించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

545 రకాల సేవలు

గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం సచివాలయాల ద్వా రా 545 రకాల సేవలను ప్రజలకు అందుబాటులో కి తీసుకు వచ్చింది. వాటికి అనుసంధానంగా ఏర్పా టు చేసిన రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వ్యవసాయ, ఆరోగ్య సేవలను అందించింది. మండల కేంద్రాలకు వెళ్లే బాధ లేకుండా ఇంటి ముంగిటే సేవలు అందించడంతో సచివాలయాలకు ప్రజల నుంచి ఆదరణ లభించింది.





రాపూరు మండలం తెగచర్ల సచివాలయం, సైదాపురం లింగసముద్రం గ్రామ సచివాలయం

తెరుచుకోని వెబ్‌సైట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయాల వైభవం తగ్గిపోయింది. వలంటీర్ వ్యవస్థ లేక పోవడంతో సచివాలయ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇది మంచి ప్రభుత్వం ప్రచారాన్ని సైతం వారే చేపట్టారు. గతంలో సచివాలయాల ద్వారా అందించిన సేవలు ప్రస్తుతం తగ్గుతూ వస్తున్నాయి. కులం, ఆదాయం, 1బీ తదితర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు ఎంతో అవసరమైన రేషన్‌కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్య శ్రీ కార్డులు తదితర సేవలకు సంబంధించిన వెబ్‌సైట్లు ఓపెన్ కావడం లేదు. దీంతో సచివాలయాల చుట్టూ ప్రజలు నిత్యం తిరుగుతున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా వెబ్ సైట్ తెరుచుకోకపోవడంతో సచివాలయాల ఉద్యోగులు సైతం ఏంచేయాలో తెలియక సందిగ్ధంలో ఉండిపోయారు. కొత్త వాటిని మంజూరు చేయకపోయినా గతంలో ఉన్న వాటిలో తప్పొప్పుల సవరణలు చేసేందుకైనా అవకాశం కల్పిస్తే బాగుంటుందని సచివాలయ ఉద్యోగులే అభిప్రాయ పడుతున్నారు.

నాడు విమర్శలు... నేడు సేవలు

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసే సమయంలో అప్పటి వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంపై టీడీపీ విమర్శలు చేసింది. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం సచివాలయ సిబ్బందితోనే సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా సామాజిక పింఛన్లు పంపిణీ, ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్లు అతికించే పనులు తదితర ప్రభుత్వ కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగుల ద్వారానే చేయిస్తోంది. అయితే ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను మళ్లీ సచివాలయాల్లో ప్రారంభిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని అటు ఉద్యోగులు, ప్రజలు పేర్కొంటున్నారు.

వెంకటగిరి నియోజకవర్గంలో సచివాలయాల సంఖ్య

మండలం	సచివాలయాల సంఖ్య	ఖర్చుచేసింది
రాపూరు	18	రూ. 6.30 కోట్లు
సైదాపురం	19	రూ.6.65 కోట్లు
కలువాయి	15	రూ.5.25 కోట్లు
డక్కిలి	14	రూ.4.90 కోట్లు
బాలాయపల్లి	14	రూ.4.90 కోట్లు
వెంకటగిరి మున్సిపాలిటి	14	రూ. 4.90 కోట్లు
వెంకటగిరిరూరల్	15	రూ.5.25 కోట్లు
సచివాలయాల సిబ్బంది సంఖ్య –		1166

4న బీఎస్ఎన్ఎల్ మేళా

వెంకటగిరి రూరల్: బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభించిన సందర్భంగా ఈనెల 4వ తేదీ నుండి బీఎస్ఎన్ఎల్ మేళా ప్రారంభించనున్నట్లు డీఈ కలైమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ టవర్ పరిధిలో 3జీ సిమ్‌ను 4జీగా అప్‌డేట్ చేయనున్నట్లు తెలియజేశారు. శనివారం బాలాయపల్లి, ఆదివారం జయంపు, బుధ, గురువారాల్లో నిడిగల్లులో సిమ్ మేళా నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



విజేతలకు బహుమతుల పంపిణీ

గూడూరు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా మక్కువ పెంచుకుని జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. రెండో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పరుగు పందెంలో గెలిచిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్‌కుమార్ ప్రియా, రవిక్రిష్ణ, వెంకటేశ్వర్లు, విజయకుమార్, బిల్లు చెంచురామయ్య, వెంకటేష్, ముమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అద్దెలు చెల్లించని మున్సిపల్ దుకాణాలకు తాళాలు



మున్సిపల్ దుకాణాల అద్దె వసూలు చేస్తున్న బిల్ కలెక్టర్లు

నాయుడుపేట టౌన్: నెలల తరబడి అద్దెలు చెల్లించని మున్సిపల్ దుకాణాలకు తాళాలు వేసేలా కమిషనర్ షేక్ ఫజులుల్లా గురువారం చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ దుకాణాలను లీజుకు పొడుకుని నెలల తరబడి అద్దెలు చెల్లించనివారిపై చర్యలు చేపట్టడం లేదని కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. దీంతో మున్సిపల్ దుకాణాల సముదాయాల వద్దకు బిల్ కలెక్టర్లతోపాటు సచివాలయ అడ్మిన్లు గురువారం వెళ్లి అద్దెలు వసూలు చేసేలా కమిషనర్ చర్యలు చేపట్టారు. ఒక్క రోజులోనే సుమారు రూ.4 లక్షల వరకు అద్దెలు వసూలు చేసినట్లు బిల్ కలెక్టర్లు తెలిపారు. అద్దెలు చెల్లించని 5 దుకాణాలకు తాళాలు వేసినట్లు వెల్లడించారు.

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి



చిల్లకూరు: రెవెన్యూ సదస్సులో వచ్చే భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని తూర్పుకనుపూరు సర్పంచ్ అన్నాడిశెట్టి నాగమ్మ కోరారు. తూర్పుకనుపూరులో గురువారం గ్రామానికి చెందిన నల్లం క్రిష్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మల్లికార్జున్, నవనీతం పాఠశాల మేనేజర్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

కోట: కోట, విద్యానగర్‌లోని డాబాలు, బేకరీలలో గురువారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్‌కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ నర్మద బేకరీల్లో తయారు చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, తినుబండారాలు, కేక్‌ల తయారీలో వాడుతున్న రంగులను పరిశీలించారు. నమూనాలు సేకరించారు. వాటిని ల్యాబ్‌లో పరీక్షించి కల్తీ ఉన్నట్లు తేలితే కేసులు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా డాబాల్లోను తనిఖీలు నిర్వహించారు. డాబాల్లో తయారు చేసే ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉండాలని, మాంసం, నూనె వాడకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

విలువైన స్థలాల ఆక్రమణ



గాంధీనగర్‌లోని జగనన్న లే అవుట్ ఖాళీస్థలంలో అక్రమ నిర్మాణాలు

చిల్లకూరు: గూడూరు పరిసర ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. గాంధీనగర్ ప్రాంతంలోని జగనన్న లే అవుట్ వద్ద ఎవరికీ కేటాయించని కొన్ని ప్లాట్లు ఆక్రమించుకుని కట్టడాలను నిర్మిస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి రహదారి పక్కనే కేటాయించకుండా ఉన్న స్థలంలో టీ కొట్టు పెట్టుకున్నాడు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకుల అండతో రెవెన్యూ అధికారుల కన్ను కప్పి రాత్రికి రాత్రి పునాదులు తీసి గోడలు నిర్మించి రేకులు వేశారు. ఈ విషయంపై స్థానిక వీఆర్ఓ చంద్రను వివరణ కోరగా గత నాలుగు రోజులు క్రితం ఆక్రమించుకున్న వ్యక్తిని హెచ్చరించామని, అతను రాత్రికి రాత్రి నిర్మించడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఫైనల్స్‌కు ఎల్‌పీపీ, శ్రీచైతన్య జట్లు



హోరాహోరీగా క్రికెట్ పోటీలు

గూడూరు రూరల్: అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీలలో గురువారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఎల్‌పీపీ, శ్రీ చైతన్య పాఠశాలల జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నట్లు నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మునిగిరీష్ తెలిపారు. అంతర్ పాఠశాలల క్రికెట్‌లో భాగంగా పలు పాఠశాలలు ఈ పోటీలలో పాల్గొన్నట్టు తెలిపారు. శుక్రవారం ఫైనల్స్‌కు చేరిన రెండు జట్లు తలపడతాయని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించరా..



సీసీ రోడ్డుకు ముందుగా వేసే కాంక్రీట్

సైదాపురం: ప్రధాన కూడలిలో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలను అలానే వదిలివేసి నిర్మాణ పనులు చేపడుతుండడం పలు వివాదాలకు తావిస్తోంది. రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో విద్యుత్ స్తంభాలను తొలగించకుండా సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. రాపూరు నుంచి పొదలకూరుకు వెళ్లాల్సిన మలుపు వద్ద ఇలా స్తంభాలను వదిలేసి రహదారి వేస్తుండడంతో పలు ప్రమాదాలు కూడా జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇకనైనా ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయ పరుచుకుని విద్యుత్ స్తంభాలను తొలగించి రహదారిని నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ దయాకర్ అధ్యక్షతన పాఠశాల యాజమాన్య విద్యాకమిటీ చైర్మన్‌లు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులను ఎంపీడీఓ పురుషోత్తంశివకుమార్‌ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎస్ఎంసీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు యాజమాన్య కమిటీ విధులపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తీసుకున్న వారు 4వ తేదీన ఆయా పాఠశాలల్లో మిగిలిన సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని ఎంఈఓ కోరారు. కార్యక్రమంలో ఆర్పీలు వీరరాఘవులు, ప్రసాద్, టి.రవి, ఎంఈఓ–2 సుప్రియ తదితరులున్నారు.

బీటీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నాయుడుపేట టౌన్: బహుజన టీచర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన డైరీ, క్యాలెండర్‌లను గురువారం డిప్యూటీ డీఈఓ దువ్వూరు సనత్‌కుమార్ ఆవిష్కరించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ సభ్యులకు జరుగుతున్న శిక్షణ తరగతులను పరిశీలించేందుకు వచ్చిన గూడూరు డిప్యూటీ డీఈఓ చేతులు మీదుగా బీటీఏ సంఘ నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంఈఓ మునిరత్నం, బీటీఏ ఉపాధ్యాయ సంఘ నాయకులు పేర్నాటి రామకృష్ణా, జెడ్డా వెంకట్రావ్, పాలేటి చంద్రయ్య, బొడ్డు బాబు, లక్ష్మీప్రసాద్, పెంచలయ్య పాల్గొన్నారు.

బాబా మందిరంలో అన్నదానం



భక్తులకు అన్నదానం

ఓజిలి: మండలంలోని మానమాల గ్రామంలో సాయినాథునికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర నిర్మాణకర్తలు ఉచ్చూరు హరనాథ్‌రెడ్డి, శోభారాణి దంపతులు శాశ్వత గోత్ర నామాలతో ఆలయ పండితులు పూజలు చేసి ఉదయం బాబాకు కాగడ హారతి ఇచ్చారు. బాబాకు పాలాభిషేకం, దత్తాత్రేయ స్వామిలకు అభిషేకాలు, హారతులు ఇచ్చి గజమాలతో బాబాను అలంకరించారు. నాయుడుపేట మండలం మేనకూరు గ్రామానికి చెందిన కట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సాయిసుజనా, సత్య సుధాకర్, లక్ష్మిసాయి, మానమాల గ్రామానికి చెందిన ఉచ్చూరు సాయివెంకటేష్‌రెడ్డి, జీవన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించి, 400 మందికి అన్నదానం చేశారు. రాత్రి భజనగీతాలు ఆలపించి పల్లకీ సేవ చేసి శేజ్ హారతితో భక్తులకు తీర్థప్రసాదాలను పంచి పెట్టారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న శ్రీనివాసులు



శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ సనత్‌కుమార్, ఎంఈఓ మునిరత్నం తదితరులు

రాపూరు: పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీ లు కృషి చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు పేర్కొ న్నారు. రాపూరు హిందూ ప్రాథమిక పాఠశాల్లో గురువారం హెచ్‌ఎంలకు, ఎస్ఎంసీ చైర్మన్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల్లో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమం, విద్యా కార్యక్రమాల్లో ఎస్ఎంసీ కమిటీ భాగస్వాములు కావాలన్నారు. పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలుగా శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి, హెచ్ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

కోటలో..

కోట: మండలంలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు గురువారం కోట జెడ్పీ హైస్కూల్‌లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిట్టమూరు ఎంఈఓ క్రిష్ణయ్య అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఎస్ఎంసీ సభ్యులకు విధివిధానాల ను వివరించారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మస్తానయ్య, రిసోర్స్ పర్సన్స్ నాగయ్య, సుబ్బారావు, క్రిష్ణ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు తరచూ పాఠశాలలను సందర్శించి సమస్యలను తెలుసుకోవాలని డిప్యూటీ డీఈఓ దువ్వూరు సనత్‌కుమార్ సూచించారు. ఎస్ఎంసీ సభ్యుల బాధ్యతలు, తదితర అంశాలపై వారికి రిసోర్స్ పర్సన్‌లు గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సూళ్లూరుపేట, గూడూరు డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందినవారికి అవగాహన కల్పించారు. శిక్షణ తరగుతులను డిప్యూటీ డీఈఓ పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా ఎంఈఓ మునిరత్నం వ్యవహరించారు.

ప్రజల వద్దకే అధికారులు

శ్రీకాళహస్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కోరారు. గురువారం తొట్టంబేడు మండలం పెద్దకనపర్తిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. జేసీ మాట్లాడుతూ.. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే ప్రజల వద్దకు వచ్చి సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): గుర్తుతెలియని కారు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్య, భర్త, రెండేళ్ల కుమార్తె గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం బాధితుడు రేణిగుంట పోలీసులకు రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఎన్టీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న భగవాన్, భార్య శ్రావణి, కుమార్తె హేమశ్రీతో కలిసి స్కూటీపై గుడికి వెళ్లేందుకు బుధవారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి నుంచి రేణిగుంట వైపు వస్తుండగా మల్లవరం సమీపంలో గుర్తుతెలియని కారు ఢీ కొట్టింది. కారు డ్రైవర్ వేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోవడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సహాయంతో తిరుపతిలోని ప్రవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. గుర్తు తెలియని కారు డ్రైవర్‌ని కనిపెట్టాలని బాధితుడు పోలీసులను కోరారు.

మంచు దుప్పటి





చిల్లకూరు: మంచు విపరీతంగా కురుస్తుండడంతో రహదారుల మీద ప్రయాణం కూడా కష్ట తరంగా మారింది. గూడూరు పట్టణంలో ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు పొగ మంచు పరుచుకోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.రైల్వే పట్టాలపై కూడా పొగ మంచు పరుచుకుంది. ఉదయం 9 గంటలకు సూర్యుడు మబ్బుల చాటు నుంచి బయటకు రావడం కనిపించింది.